

సాక్షి
బాపట్ల
శనివారం । 19 । అక్టోబర్ । 2024



64,312 క్యూసెక్కులు విడుదల

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 65,756 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 64,312 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 1516 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 40 క్యూసెక్కులు వదిలారు.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి గుంటూరుకి చెందిన ఇనుకొల్లు సునీల్‌కుమార్, హారిక దంపతులు రూ. 1,11,111 అందజేశారు.

న్యూస్‌రీల్

వ్యాధిగ్రస్తులకు సేవలు చేయటం గొప్పవిషయం

–డీఎంఅండ్‌హెచ్‌ఓ విజయమ్మ



బాపట్ల: వ్యాధిగ్రస్తులకు సేవలు చేయటం ఎంతో గొప్ప విషయమని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ పేర్కొన్నారు. ప్రపంచ పాలియేటివ్ కేర్ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రదర్శన చేపట్టారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ మాట్లాడుతూ పాలియేటివ్ కేర్‌లో ప్రధానంగా క్యాన్సర్ రోగగ్రస్తులకు బాధ తెలియకుండా సేవలు చేయటం, కుటుంబ సభ్యులకు ఉపశమనం కలిగించటం, వృద్ధాప్యంలో వచ్చే దీర్ఘకాలిక రోగాలకు సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డి.వెంకటేశ్వర్లు, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి బి.మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పడిన కారు

– ముగ్గురికి గాయాలు



మేదరమెట్ల: కారు అదుపుతప్పి కాల్వలో పడటంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కొరిశపాడు మండల పరిధిలోని జాతీయ రహదారి సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చెన్నై నుంచి గుంటూరుకు వెళ్తున్న కారు అదుపుతప్పి కొరిశపాడు మండల పరిధిలోని కొరిశపాడు–పీ.గుడిపాడు జాతీయ రహదారి సమీపంలో రోడ్డు పక్కన ఉన్న కాలువలో పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురికి స్వల్పగాయాలు కాగా వీరిని హైవే అంబులెన్స్‌లో ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈమేరకు మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సీతారామాలయ అభివృద్ధికి చర్యలు

ఆలయాన్ని సందర్శించిన అసిస్టెంట్ కమిషనర్



చినగంజాం: శిథిలావస్థలో ఉన్న సీతారామాలయాన్ని అభివృద్ధి చేస్తామని బాపట్ల జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎం సూర్య ప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం చినగంజాంలో శిథిలావస్థలో ఉన్న సీతారామాలయాన్ని ఆయన పరిశీలించారు. చినగంజాంలో కొన్ని దశాబ్దాలుగా పూజా కార్యక్రమాలు లేక శిథిలావస్థలో కొనసాగుతున్న దేవాలయాన్ని పునరుద్ధరించాలని స్థానిక ప్రజలు ఆయనను కోరారు. ఆయన ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించి ఆలయ అభివృద్ధికి శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో దేవదాయశాఖ నిధులతో ఆలయాన్ని తిరిగి నిర్మాణం చేసుకునే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వేణుగోపాల్, కార్యనిర్వాహణాధికారి మీనిశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ రాయని ఆత్మారావు, ఉప సర్పంచ్ రాఘవరావు, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయిని మృతి



వినుకొండ(నూజెండ్ల): రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయినీ మృతిచెందిన సంఘటన వినుకొండ రూరల్ మండలం నాగులవరం సమీపంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా అద్దంకి పట్టణానికి చెందిన కొత్తమాస ధనలక్ష్మి (41) వినుకొండ రూరల్ మండలం గోకనకొండ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తుంది. విధుల్లో భాగంగా ఉదయాన్నే మరో ఉపాధ్యాయుడు ద్విచక్రవాహనంపై పాఠశాలకు వస్తుండగా నాగులవరం సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తూ బండిపై నుంచి జారిపడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలికి భర్త నాగేశ్వరరావు, ఒక బాబు ఉన్నాడు. వినుకొండ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ ముగిసింది. దుకాణాలు కూడా ప్రారంభించారు. ఇక బెల్టు షాపుల ఏర్పాటుపై దృష్టి కేంద్రీకరించారు. ఇక్కడే రగడ మొదలైంది. ఏ గ్రామంలో ఎవరు బెల్టు షాపు ఏర్పాటు చేయాలో పచ్చ నేతలు నిర్ణయిస్తున్నారు. అంతేకాకుండా ఒక్కొక్క బెల్టు షాపునకు రూ.2 లక్షల నుంచి రూ.3లక్షలు డిపాజిట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కొంతమంది వ్యాపారులు దీనిని వ్యతిరేకిస్తున్నారు. ఎమ్మెల్యేల వద్ద పంచాయితీలు పెడుతున్నారు.



రచ్చకెక్కిన బెల్టు రగడ

- సిండికేట్ కాని దగ్గర బెల్టు షాపుల ఏర్పాటుకు సన్నాహాలు
- ఏ ఊరికి ఏ మద్యం షాపు కేటాయించాలన్న దానిపై వివాదం
- ఎమ్మెల్యేల వద్ద పంచాయితీలు
- సిండికేట్ అయిన చోట ఇప్పటికే బెల్ట్ షాపులు ప్రారంభం
- ఒక్కొక్క బెల్టు షాపు ఏర్పాటుకు రూ.2 నుంచి రూ.5 లక్షలు డిపాజిట్
- రేపల్లె, పర్చూరు నియోజకవర్గాల్లో బ్లాక్‌లో అమ్మకాలు
- బెల్టు షాపులకు మద్యం అమ్ముతున్న సిండికేట్
- క్వార్టర్‌పై రూ.50 నుంచి రూ.100 అదనం
- యద్దనపూడి మద్యం దుకాణంపై నాన్‌లోకల్ రచ్చ

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో బెల్టు షాపుల ఏర్పాటు వ్యవహారం జోరందుకుంది. జిల్లాలోని 25 మండలాల పరిధిలో 117 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఒక్కొక్క మండలానికి రెండు 2 నుంచి 6 మద్యం దుకాణాలు కేటాయించారు. రేపల్లె, వేమూరు, అద్దంకి నియోజకవర్గాల్లో మద్యం దుకాణాలు ఇప్పటికే సిండికేట్ కాగా పర్చూరు, బాపట్ల, చీరాల నియోజకవర్గాల్లోని కొన్ని మండలాల్లో ఇంకా కొన్ని దుకాణాలు సిండికేట్‌లో కలవలేదు. దీంతో అక్కడున్న మద్యం షాపులకు గ్రామాలను బెల్టు షాపుల కోసం పంచుకునే విషయంలో వివాదం నెలకొంది. మద్యం దుకాణాలు దక్కించుకున్న కొందరు పచ్చ పార్టీ నేతలు, కార్యకర్తలు సిండికేట్‌కు ససేమిరా అంటుండడంతో ఈ వివాదం మరింత ముదిరింది.

ఎమ్మెల్యే వద్ద యద్దనపూడి పంచాయితీ

ఇంకొల్లు మండలం ఇడపలపాడుకు చెందిన టీడీపీ నేతలకు యద్దనపూడి మండలంలో మద్యం దుకాణం వచ్చింది. మరో దుకాణం సిండికేట్‌లో ఉన్న యద్దనపూడి పచ్చనేతలకు రావడంతో వారు చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిలో అనంతవరం వద్ద దుకాణం ఏర్పాటు చేశారు. రెండో దుకాణాన్ని సిండికేట్‌లో కలపాలని, లేకపోతే యద్దనపూడిలో మద్యం దుకాణం పెట్టనిచ్చేది లేదని యద్దనపూడి పచ్చనేతలు బెదిరింపులకు దిగారు. షాపును సిండికేట్‌లో కలిపేందుకు ఇడపలపాడు నేతలు ససేమిరా అనడంతో వివాదం ముదిరింది. దీంతో యద్దనపూడి నేతలు విషయాన్ని పర్చూరు ఎమ్మెల్యే వద్ద పెట్టారు. రెండు మద్యం దుకాణాలు సిండికేట్ కాకపోతే బెల్ట్ షాపుల ఏర్పాటుకు గ్రామాలను పంచుకోవడం ఇబ్బంది అవుతుందని సిండికేట్ సూచించింది. అయినా ఇడపలపాడు నేతలు అంగీకరించకపోవడంతో ఇరువర్గాలను కూర్చోబెట్టి పంచాయితీ పెట్టేందుకు ఎమ్మెల్యే సిద్ధమయ్యారు.

చీరాలలో తేలని సిండికేట్

చీరాల నియోజకవర్గంలో పచ్చపార్టీతోపాటు ఇతరులకు మద్యం దుకాణాలు దక్కడంతో ఇక్కడ సిండికేట్ వ్యవహారం ఇంకా తేలలేదు. అందరూ సిండికేట్‌లో కలవాలని పచ్చనేత తనయుడు ఒత్తిడి తెచ్చారు. అందరూ కలిస్తే ఊరూరా మందు దుకాణాలు పెట్టవచ్చని సూచిస్తున్నారు.

అధిక ధరలకు మద్యం అమ్మకాలు

రేపల్లె నియోజకవర్గంలో ఇప్పటికే సిండికేట్‌గా మారిన మద్యం వ్యాపారులు పేరుకు మద్యం దుకాణాలు ఏర్పాటు చేసినా...సిండికేట్‌ను నడిపిస్తున్న చెరుకుపల్లి నేత మద్యాన్ని షాపుల్లో పెట్టకుండా బెల్టు షాపులకు విక్రయించారు. దీంతో వారు ఒక్కొక్క క్వార్టర్ బాటిల్‌పై రూ.50 నుంచి రూ.100 అధికంగా తీసుకొని మద్యం విక్రయిస్తున్నారు. దుకాణంలో ఎమ్మార్పీకి ఇవ్వాల్సి వస్తుందని పచ్చనేత ఏకంగా మద్యం మొత్తాన్ని బెల్ట్ ద్వారా విక్రయిస్తున్నారు. మద్యం షాపుల్లో దొరక్కపోవడంతో మద్యం ప్రియులు అధిక ధరలు వెచ్చించి బెల్ట్ షాపుల వద్ద మద్యం కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. మిగిలిన నియోజకవర్గాల్లోనూ చాలామంది మద్యం షాపులవారు మద్యాన్ని షాపులో కాకుండా అధిక ధరలకు బయట బెల్ట్‌లో పెట్టి విక్రయిస్తున్నారు. అయినా ఎక్సైజ్ అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు.

బెల్టు కోసం లక్షల్లో వసూళ్లు

బెల్టు షాపుల కోసం మద్యం షాపుల యజమానులు లక్షల్లో వసూళ్లకు దిగారు. చిన్నచిన్న గ్రామాల్లో బెల్టు షాపుల ఏర్పాటుకు రూ.రెండు లక్షలు తక్కువ లేకుండా వసూలు చేస్తుండగా పెద్ద గ్రామాల్లో రూ.మూడు లక్షల నుంచి రూ.5 లక్షలు డిపాజిట్లు సేకరిస్తున్నారు.

ఎంపీ వర్సెస్ ఎమ్మెల్యే

బాపట్లలో బెల్టు వివాదం తీవ్రస్థాయికి చేరింది. ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నరేంద్రవర్మలు వేర్వేరుగా మద్యం దుకాణాలను దక్కించుకున్నారు. షాపుల ఏర్పాటులో పోటీపడి పక్కపక్కనే పెట్టడంతో రచ్చ రోడ్డున పడింది. ఇక్కడ మద్యం దుకాణాల సిండికేట్ వ్యవహారం కొంత సమయం పట్టేలా వుంది. మిగిలిన దుకాణాల వారు సిండికేట్ కోసం పట్టుబడుతున్నారు. పట్టణంలో బెల్టు షాపుల ఏర్పాటుకు ఎమ్మెల్యే వర్గీయులు సిద్ధమయ్యారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో బెల్టు షాపులు పెట్టేశారు. పట్టణానికి చెందిన మద్యం దుకాణాల వారు కొందరు పట్టణంతోపాటు రూరల్ పరిధిలోని గ్రామాల్లో కూడా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసుకుంటామని డిమాండ్ చేస్తున్నారు. పట్టణంతో పోలిస్తే రూరల్‌లో రాబడి తక్కువ ఉన్నందున బెల్టు దుకాణాలను తమకే అప్పగించాలని రూరల్ మద్యం దుకాణాల వారు ఎమ్మెల్యే వద్ద ప్రతిపాదనలు పెట్టారు.వివాదాల నేపథ్యంలో అందరూ సిండికేట్‌లోకి వస్తే బెల్టు షాపుల ఏర్పాటులో సమస్యలు తలెత్తవని ఎమ్మెల్యే సూచిస్తున్నట్లు సమాచారం.



మాట్లాడుతున్న జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్

భూ సమస్యలన్నీ పరిష్కరించేలా చర్యలు

బాపట్ల: భూ సమస్యలన్నీ పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అధికారులకు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లాస్థాయి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ భూమి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్యాలయాలకు వచ్చే వారి పట్ల నిర్లిప్తంగా ఉండరాదని అన్నారు. బాధితుల సమస్యలు క్షుణ్ణంగా పరిశీలించి, వారు సంతృప్తి చెందేలా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది డెప్యూటేషన్ కావాలని సిఫార్సులు చేస్తే సీసీఎల్ఏకు సరెండర్ చేస్తామని స్పష్టం చేశారు. చౌక దుకాణాలలో ఖాళీలను షెడ్యూల్ ప్రకారం భర్తీ చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని ప్రభుత్వం లక్ష్యం కాగా ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు మంచి ధర కల్పించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అన్నారు. 150 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతుల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. నీటి సంఘాల ఎన్నికలు షెడ్యూల్ ప్రకారం సమర్థంగా నిర్వహించాలని తెలిపారు. పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల జాబితా సిద్ధం చేయాలన్నారు. జాతీయ రహదారుల భూసేకరణలో నష్టపోయిన రైతులకు మానవతా దృక్పథంతో పరిహారం అందేలా చూడాలన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు భూసేకరణ చేయాలని, జిల్లా కేంద్రంలో స్టేడియం నిర్మాణానికి అవసరమైన భూమి సర్వే చేసి నివేదిక ఇవ్వాలన్నారు. డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఇద్దరిని వరించిన ప్రతిభా అవార్డులు

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజె అబ్దుల్ కలాం నేషనల్ ప్రతిభా అవార్డులకు పిట్టలవానిపాలెం మండల పరిధిలోని ఖాజీపాలెం కేవీఆర్, కేవీఆర్ అండ్ ఎంకెఆర్ కళాశాల అధ్యాపకుడు వి.నారాయణరెడ్డి, చందోలు ఇండియన్ బ్లూమ్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎండీ రియాజ్ అహ్మద్‌లు ఎంపికయ్యారు. కేవీఆర్, కేవీఆర్ అండ్ ఎంకెఆర్ అధ్యాపకుడు వి.నారాయణ రెడ్డి బోధనా నైపుణ్యం భారత ప్రభుత్వం రాజకీయాలు, ప్రభుత్వ పాలన పాలనా సూత్రాలు రాజనీతిశాస్త్రం అనే పుస్తకాలను రచించి విద్యార్థులకు అవగాహన కల్పించటం, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించటం వలన అవార్డుకు ఎంపికయ్యాడని కళాశాల యాజమాన్యం ప్రకటనలో తెలిపింది. చందోలు బ్లూమ్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎండీ రియాజ్ అహ్మద్ 2000 సంవత్సరంలో ఇండియన్ బ్లూమ్స్ విద్యాసంస్థను ఏర్పాటు చేసి విద్యార్థులను ఉన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దటంతో పాటు పలు రంగాలలో ఉద్యోగాలు సాధించేందుకు కృషి చేసినందుకు అవార్డుకు ఎంపికయ్యారని పాఠశాల యాజమాన్యం తెలిపింది. అవార్డుకు ఎంపికైన ఇరువురు ఈనెల 20వ తేదీన నాగార్జున యూనివర్సిటీలో జరిగే కార్యక్రమంలో అవార్డును అందుకుంటారని తెలిపారు.

నేనే అభ్యర్థినంటూ వెళ్లడమెందుకు?

- ఓటర్ల నమోదు .. పార్టీ నాయకుల బాధ్యత కాదా ?
- అభ్యర్థిత్వం ప్రకటనకు అభిప్రాయాలు అవసరం
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిపై చంద్రబాబు

సాక్షి, విజయవాడ: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి తానే పోటీదారునంటూ వెళ్లడమెందుకు, అభ్యర్థిత్వం ఖరారు కానప్పుడు అలా చెప్పుకోవడం ఎందుకు ? అని చంద్రబాబు ప్రశ్నించడంతో ఖంగుతినడం నాయకులవంతయ్యింది. రెండు జిల్లాల్లోని ముఖ్యులతో మాట్లాడకుండానే అభ్యర్థిని నిర్ణయించేద్దామా అని స్వరం పెంచడంతో ఎవరికీ మాట పెగల్లేదు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి ఎన్నికల్లో పోటీకి గుంటూరు జిల్లా తెనాలికి చెందిన నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్ సిద్ధమయ్యారని, ఆయన పేరును ప్రకటిస్తే సరిపోతుందని శుక్రవారం పార్టీ ప్రధాన కార్యాలయంలో తనను కలిసిన ఒకరిద్దరు నాయకులు ప్రస్తావించడంతో చంద్రబాబు పైవిధంగా స్పందించారని విశ్వసనీయ సమాచారం. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి టీడీపీ నుంచి తాను పోటీలో ఉన్నట్లు ఆలపాటి ప్రచారాన్ని వేగవంతం చేయడం స్వపక్షంతో పాటు కూటమిలోని పలువురు ముఖ్య నాయకులకు నచ్చడం లేదు. పట్టభద్రుల ఓటర్లను చేర్పించే మిషతో ఆలపాటి వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్న విషయాన్ని పార్టీలోని ఆయన వ్యతిరేకవర్గం అధిష్టానం దృష్టికి తీసుకెళ్లింది. కూటమిలో చర్చకు దారి తీసిన ఈ అంశంపై స్పష్టత ఇస్తే బాగుంటుందనే ఉద్దేశంతో చంద్రబాబు వద్ద ప్రస్తావించగా ఆయన ఘాటుగా స్పందించిన తీరు గుంటూరు, కృష్ణా జిల్లాల పార్టీ నేతల మధ్య హాట్ టాపిక్‌గా మారిందని సమాచారం.

మారు మాట్లాడని నాయకులు

ఎన్నికల్లో పోటీ ఎవరు చేస్తారనేది అటుంచితే ఓటర్లను నమోదు చేయించాల్సిన బాధ్యత పార్టీలోని నాయకులు అందరిదీ. ప్రతి నియోజకవర్గంలోని వారు చొరవ తీసుకుని ఆ పని చేయాలి. ఎవరికి వారు వ్యక్తిగతంగా తీసుకోవడమో, ఓ నాయకుడికి మద్దతుగా మాట్లాడటమో ఏమాత్రం సరికాదని బాబు అనడంతో ఆయన ఎదుట ఉన్న నాయకులు మారు మాటాడలేదని తెలిసింది. అభ్యర్థిత్వం ప్రకటించాలంటే రెండు జిల్లాల్లోని ముఖ్యులతో పాటు ఇతర వర్గాల ద్వారా అభిప్రాయాలు సేకరించాలి. సానుకూలత ఏమేరకు ఉందనేది అంచనా వేసుకోవాలి. పైగా కూటమిలోని ముఖ్యులతో సంప్రదింపులు జరపాలి. ఓ అభిప్రాయానికి రావాలి. ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేయడానికి చాలామంది ముందుకు వస్తున్నారు. అన్నీ సర్దుబాటు చేసుకున్నాక నిర్ణయం తీసుకుందామని బాబు అనడం రెండు జిల్లాల నాయకులను ఆలోచనల్లో పడేసినట్లయింది.

ప్రేమజంట ఆత్మహత్య

పెదకాకాని: పెళ్లికి పెద్దలు అంగీకరించలేదని ఓ ప్రేమజంట శుక్రవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన దానబోయిన సాంబశివరావు దంపతుల చిన్న కుమారుడు మహేష్(22) రెండేళ్లుగా హైదరాబాద్‌లోని ఓ సెల్‌ఫోన్ షోరూంలో పని చేస్తున్నాడు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన నంద్రు వెంకయ్య, విజయ దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. చిన్న కుమార్తె శైలజ కూడా అదే సెల్‌ఫోన్ షోరూంలో ఉద్యోగంలో చేరింది. మహేష్, శైలజల మధ్య పరిచయం కాస్త ప్రేమగా మారింది. వారి కులాలు వేరు కావడంతో పెళ్లికి పెద్దలు అంగీకరించలేదు. వారం కిందట ఇంటి నుంచి కొంత నగదుతో బయటకెళ్లిన మహేష్ తిరిగి రాలేదు. శుక్రవారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో ఇద్దరూ బైక్‌పై పెదకాకాని భ్రమరాంబపురం ఆర్చి సమీపంలో రైల్వే ట్రాక్ వద్దకు చేరుకున్నారు. బైక్, వారి వద్ద ఉన్న బ్యాగ్‌లు అక్కడే పెట్టి ఇద్దరూ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు.

మారని పరదా బతుకులు

- బల్లికురవ, మార్టూరు, అద్దంకి మండలాల నుంచి 1200 కుటుంబాలు వలస
- నరసరావుపేట, తెనాలి, కాకినాడ, తమిళనాడు ప్రాంతాల నుంచి సంచుల దిగుమతి
- ఏడునెలలు ఇతర ప్రాంతాల్లోనే మకాం
- పంటలు సక్రమంగా పండక, పరదాలకు గిరాకీ లేక అవస్థలు
- వీ.కొప్పరపాడు, అద్దంకిలో పరదా పట్టల తయారీ యూనిట్లు



గోతాలు శుభ్రం చేస్తున్న మహిళలు

బల్లికురవ: ప్రభుత్వాలు మారాయి.. ప్రజలు జీవన విధానాలు మారాయి కానీ కొందరి జీవితాలు మాత్రం మారడం లేదు. ఏళ్లకు ఏళ్లుగా వారసత్వాన్నే నమ్ముకుంటూ వలస వెళ్లి కాలం వెళ్లదీస్తున్నారు సుగాలీలు. వీళ్లకు తెలిసిందల్లా ఒక్కటే కష్టపడి పనిచేయడమే. వారసత్వం, అలవాటుపడి పరదా పట్టాలను పరాయి ప్రాంతాల్లో అద్దెకిస్తూ సుగాలీలు జీవనాన్ని వెళ్లదీస్తున్నారు. బల్లికురవ, మార్టూరు, అద్దంకి మండలాల్లోని సుమారు 1200 కుటుంబాలు ఆరు దశాబ్దాలుగా రైతులు పండించిన పంటలను పరదాలతో నూర్పిళ్లు చేస్తున్నారు. బల్లికురవ మండలంలోని వేమవరం, వీ.కొప్పరపాడు, అరుణగిరి, మార్టూరు, నాగరాజుపల్లి తండా, అద్దంకి పరసర గ్రామాల నుంచి అక్టోబర్ 10వ తేదీ నుంచి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలకు వెళ్లి పరదా పట్టాలు అద్దెకిస్తున్నారు.

కుటుంబాలను వదిలి..

దసరా పండుగ తదుపరి కుటుంబాల్లోని పెద్దలైన తల్లిదండ్రులకు తమ బిడ్డల ఆలనపాలన బాధ్యత అప్పగిస్తారు. 10 నుంచి 25 పరదాలు ఒక కట్టగా కట్టుకుని 300 నుంచి 500 పరదాలతో 5 నుంచి 6 కుటుంబాలు ఓ లారీ, వ్యాన్ బాడుగకు మాట్లాడుకుని, నూర్పిళ్లకు ఎంపిక చేసుకున్న ప్రాంతానికి వెళ్తారు. అద్దెకిచ్చే ప్రాంతంలోనే గుడారాలు ఏర్పాటు చేసుకుని అక్కడే మకాం ఉంటారు. ఒక్కో కుటుంబం రూ.1.5 లక్షల నుంచి రూ. 2.7 లక్షల పెట్టుబడులతో పరదాలు తీసుకొని వెళ్తారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే పెట్టుబడి సొమ్ము వడ్డీలు పోనూ రూ.40 వేల నుంచి రూ.80 వేల వరకు ఆదాయం వస్తుంది. వాతావరణం అనుకూలించకపోతే పెట్టుబడులే గగనమని సుగాలీలు తెలిపారు.

ఎంపిక చేసుకున్న ప్రాంతాలకు..

ఎంపిక చేసుకున్న ప్రాంతాలైన ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లాలు, తెలంగాణలో మెదక్, ములుగు నిజామాబాద్, అదిలాబాద్, వరంగల్, కరీంనగర్, నల్గొండ, కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్, సింధనూర్, గుల్బర్గా, హబ్లీ, దావణగేరి, బళ్లారి, తమిళనాడు రాష్ట్రంలోని మధురై, ఈరోడ్, మహారాష్ట్రలోని నాగపూర్, శనిసింగనాపూర్, ప్రాంతాలకు జట్టుగా వెళ్తున్నారు. భారీ వర్షాలకు కర్ణాటక రాష్ట్రంలో సాగుచేసిన మొక్కజొన్న దెబ్బతినటంతో నూర్పిళ్లు నిలిచిపోయాయన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన విధంగా ఎండిన ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తే తమను ఆదుకున్నట్లేనన్నారు.



పట్టలు కుడుతున్న కార్మికులు

కొప్పరపాడు, అద్దంకిలో యూనిట్లు..

మండలంలోని వీ.కొప్పరపాడు, అద్దంకిలో పరదాల తయారీ యూనిట్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ కుటీర పరిశ్రమలా 365 రోజులు పనిచేస్తుంటారు. నరసరావుపేట, తెనాలి, కాకినాడ, తమిళనాడు ప్రాంతాల నుంచి ఖాళీ గోతాలు విడిగా టన్నుల వంతున కొనుగోలు చేసి ఇక్కడకు తెచ్చి శుభ్రం చేస్తారు. 5 నుంచి 30 గోతాలతో పరదా తయారు చేస్తారు. ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాలోని సుగాలీలు, ఎరుకలు కుటుంబాలు పరదా ఒక్కొక్కటి రూ.400 నుంచి రూ.450 వరకు వెచ్చించి కొనుగోలు చేస్తారు. ఒక్కొక్క యూనిట్‌లో ఆడ,మగ కలిపి 25 నుంచి 30 మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. చిన్న చిన్న మరమ్మతులు సుగాలి కుటుంబాలు ఇంటి వద్దే మిషన్ ద్వారా చేసుకుంటారు. ప్రతి ఏడాదీ పాత పరదాలకు తోడు కొత్త పరదాలు కొనుగోలు చేయాల్సిందేనని మూడావత్ దానా నాయక్, భూక్యా సునీల్ నాయక్ తెలిపారు.

బ్యాంకులు రుణాలిస్తే వడ్డీ భారం తగ్గుతుంది..



పరదా పట్టలు అద్దెకిస్తూ జీవనం సాగిస్తున్నాం. పెట్టుబడులకు వడ్డీ వ్యాపారుల వద్ద డబ్బు తేవటం పరిపాటి. పరదాలకు గిరాకీ లేదు. వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నాం. బ్యాంకులు తమకు పెట్టుబడి సాయంగా రుణాలు ఇస్తే మేనెలలో చెల్లించగలం.

– ఎం బాలకృష్ణ నాయక్, వేమవరం

యంత్రాల వినియోగంతో ఆర్డర్లు తగ్గాయి..



కొప్పరపాడులో రెండు దశాబ్దాలుగా పరదాలు తయారీతో 15 కుట్టుమిషన్లు, 25 మంది కూలీలకు పనులు కల్పిస్తున్నా. ఇటీవల వరి, మొక్కజొన్న, కంది, పొద్దుతిరుగుడు, జూట్ పంటల నూర్పిళ్లలో యంత్రాల వినియోగంతో గిరాకీ తగ్గి ఆర్డర్లు రావడం లేదు. అయినా కుటీర పరిశ్రమలా కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నా.

– కుందుర్తి అశోక్, కొప్పరపాడు

అధికారుల వేధింపులు



బతుకుదెరువుకు తెలంగాణ రాష్ట్రానికి పరదాలు లారీల్లో వేసుకుని వెళ్తున్నాం. మార్గం మధ్యలో తనిఖీలు పేరిట అధికారుల వేధింపులు తప్పడం లేదు. ఆంధ్రా, తెలంగాణ బోర్డర్ చెక్‌పోస్టులో ఎంతో కొంత ముట్టచెబితే కాని లారీని వదలరు.

– మూడావత్ కిషోర్ నాయక్, కొప్పరపాడు

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరిస్తాం
మంత్రి రవికుమార్



బల్లికురవ: గ్రామాల్లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పెదఅంబడపూడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెపండుగ కార్యక్రమంతో గ్రామాల్లోని సమస్యలు తెలుసుకుని పూర్తిస్థాయిలో అభివృద్ధి పరుస్తామన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ప్రాధాన్యత క్రమంలో సమస్యలను పరిష్కరించుకోవాలని చెప్పారు. అనంతరం ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుసుమకుమారి, విద్యుత్‌శాఖ అద్దంకి ఈఈ ఎస్ మస్తాన్‌రావు, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, సర్పంచ్ మైల కుసుమకుమారి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

వాలీబాల్ జట్టుకు భట్టిప్రోలు విద్యార్థిని



భట్టిప్రోలు: సత్యసాయి జిల్లా ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో హిందూపూర్‌లో ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో 10వ తరగతి చదువుచున్న సయ్యద్ షబీనా ఎంపికైంది. గుంటూరు జిల్లా వేజండ్ల హైస్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ ఎంపికలో ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్–17 జట్టు తరపున షబీనా ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు తెలిపారు.

సత్రం ఆస్తుల హక్కులపై విచారణ

విచారణ చేసిన జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్



తోటవారి ధర్మసత్రం ప్రాంతాన్ని సందర్శించిన అసిస్టెంట్ కమిషనర్ సూర్య ప్రకాష్

చినగంజాం: ధర్మసత్రానికి సంబంధించి ఆస్తులపై హక్కులు ఇవ్వాలన్న వినతిపై అధికారులు విచారణ చేశారు. మండల కేంద్రం చినగంజాంలో ప్రసిద్ధి చెందిన తోటవారి ధర్మసత్రానికి సంబంధించి తమ పూర్వీకులు హక్కు కలిగి ఉన్నారని ఓ యువకుడు కలెక్టర్‌కు ఇటీవల అర్జీ పెట్టుకున్నాడు. స్పందించిన జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి సదరు ధర్మసత్రం ఆస్తులు దేవదాయశాఖ పరిధిలో ఉన్నందున విచారణ చేయాల్సిందిగా జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌ను ఆదేశించారు.

ఈవిషయమై కమిషనర్ ఎం.సూర్యప్రకాశ్ శుక్రవారం చినగంజాం వచ్చి గ్రామంలోని తోటవారి ధర్మసత్రం పరిసర ప్రాంతాలను, ఆస్తుల వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కంభం మండలం కంభం గ్రామానికి చెందిన పఠాన్ సలీంఖాన్ గత నెల 26వ తేదీన బాపట్ల జిల్లా కలెక్టర్‌కు చినగంజాం గ్రామంలోని తోట వారి ధర్మసత్రం ఆస్తులకు సంబంధించి 1860లో అప్పటి బ్రిటీష ఇనాం కమిషనర్ జీఏ టేలర్ ఇచ్చిన ఆస్తులకు సంబంధించి తన పూర్వీకుల నుంచి తనకు కూడా హక్కు సక్రమిస్తుందని తెలపడంతో కలెక్టర్ విచారణ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఆ మేరకు తాను ఘటనా స్థలాన్ని సందర్శించి, స్థానికులతో మాట్లాడామని చెప్పారు. ఈ మేరకు నివేదికను తయారు చేసి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వేణుగోపాల్, కార్యాలయ సూపరింటెంటెంట్ రమేష్, కార్యనిర్వాహణాధికారి మీనిశెట్టి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, ఉప సర్పంచ్ చెరుకూరి రాఘవరావు, కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మానందరెడ్డి, స్థానికులు షేక్ నబీ షా, వలివేటి రామానుజం, మోటుమర్రి రామసుబ్బారావు, టీ జయరావు, పీ పార్థసారథి, బాపయ్య, కలెక్టర్ ఫిర్యాదు దారుడు పఠాన్ సలీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం

డీవైఈఓ వెంకటేశ్వరరావు



విద్యార్థులతో చెస్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న డీవైఈఓ

గుంటూరు ఎడ్యుకేషన్: క్రీడలతో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసంతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో అండర్–14, 17 బాలబాలికల జిల్లాస్థాయి చదరంగ పోటీల్ని నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లాలోని 17 నియోజకవర్గాల నుంచి 340 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా పోటీలను ప్రారంభించిన డీవైఈవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థుల మధ్య ఐకమత్యం వెల్లివిరిసి, ఉన్నత విలువలతో ఎదుగుతారని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ మొహమ్మద్ ఖాసిం మాట్లాడుతూ ఆటపాటలతో కూడినదే సంపూర్ణమైన జీవితం అని అన్నారు. కన్న స్కూల్ డైరెక్టర్ కన్న మాస్టారు మాట్లాడుతూ క్రీడలు మానసిక వికాసాన్ని కలిగిస్తాయని, ప్రతి ఒక్కరు ఏదో ఒక ఆట ఆడి ఆనందాన్ని పొందాలని తెలిపారు. ఆర్ఐపీఈ షేక్ మహబూబ్ బాషా మాట్లాడుతూ ఆటలు సమైక్యతను చాటి చెప్పడమే కాకుండా ఉపాధిని కలిగిస్తాయని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాలో రెండు శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు చెప్పారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి మెల్లంపూడి రవికుమార్ మాట్లాడుతూ క్రీడలు, చదువు విద్యార్థులు జీవితంలో అంతర్భాగం కావాలని సూచించారు. పోటీల్లో ప్రతిభ చూసిన విద్యార్థుల్ని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో నాగేంద్రమ్మ, వ్యాయామ ఉపాధ్యాయులు సామ్రాజ్యం, రవిశేఖర్, చెస్ ఆర్బిటర్ యం. గోపీనాథ్, పి.సాయిబాబు, యం. భరత్ కుమార్, వివిధ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలువలో పడి కౌలు రైతు మృతి

కర్లపాలెం: ప్రమాదవశాత్తు కాలువలో పడి కౌలు రైతు మృతిచెందిన సంఘటన కర్లపాలెం మండల పరిధిలో చోటు చేసుకుంది. కర్లపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పెదగొల్లపాలెం పంచాయతీ మార్పు చెన్నాయ్ వారిపాలెంకు చెందిన కాగిత దావీదు (68) 17వ తేదీ గురువారం తాను వ్యవసాయం చేస్తున్న కౌలు పొలం వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు మురుగు కాలువలో పడి మృతిచెందాడు. పొలం వెళ్లిన దావీదు ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు కాలువ దగ్గరకు వెళ్లి వెతకగా మృతదేహం శుక్రవారం లభ్యమైందని తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రవీంద్ర వివరించారు.


పురుగుమందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

మార్టూరు: పురుగు మందు తాగి వృద్ధుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండల కేంద్రం మార్టూరులో శుక్రవారం వెలుగు చూసింది. ఏఎస్సై షేక్ మహబూబ్ బాషా వివరాల మేరకు.. స్థానిక రామ్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న రామిశెట్టి వెంకటరమణ (65) వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ గురువారం రాత్రి తమ నివాసంలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంకటరమణను మొదట స్థానిక ప్రభుత్వానికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతరం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో వెంకటరమణ మృతి చెందాడు. మృతుడి కుమారుడు బాల శ్రీనివాస్, గుంటూరు పోలీసులు ఇచ్చిన సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

బల్లికురవ: మద్యానికి బానిసై గడ్డి మందుతాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వైద్యానికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. ఈఘటన శుక్రవారం బల్లికురవ మండలంలోని వైదన గ్రామంలో జరిగింది. ఏఎస్సై బండి శ్రీనివాసరావు వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శెట్టి నాగరాజు (35) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై ఆటో ద్వారా వచ్చే డబ్బులు ఇంట్లో ఇవ్వకపోవడంతో భార్యభర్తల మధ్య మనస్పర్ధలు ఏర్పాడ్డాయి. దీంతో జీవితంపై విరక్తితో ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి నివారణకు వాడే మందుగి అపస్మారక స్థితికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులు గుర్తించి వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. చికిత్స పొందుతూ అక్కడ చనిపోయాడు. మృతునికి భార్య రామాంజమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదుతో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని యువకుడి మృతి



తాడేపల్లి రూరల్: తాడేపల్లి కృష్ణా కెనాల్ జంక్షన్ పరిధిలోని కృష్ణానది రైల్వే బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని రైలు ఢీకొని యువకుడి మృతిపై గుంటూరు రైల్వే పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. జీఆర్పీ సీఐ జి.అంజిబాబు మాట్లాడుతూ విజయవాడ నుంచి కృష్ణా కెనాల్ వచ్చే రైల్వే లైన్‌లో కృష్ణానది బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని యువకుడి మృతదేహం రైలు పట్టాలపై పడి ఉందని తెలిపారు. ఏ రైలు ఢీకొట్టిందో సమాచారం లేదని, మృతుడి వయస్సు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండొచ్చని చెప్పారు. లేత నీలి రంగు టీషర్టు, బ్లూ కలర్ జీన్స్ ధరించి ఉన్నాడని, కుడిచేతిపై త్రిశూలం పచ్చబొట్టు ఉందని వివరించారు. ఆచూకీ తెలిసిన వారు 901099939, 9550523485 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

జాతీయస్థాయి పోటీల్లో యజ్ఞప్రసాద్‌కు రజతం



రజత పతకం సాధించిన యజ్ఞప్రసాద్

చీరాల టౌన్: జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చీరాలకు చెందిన యజ్ఞప్రసాద్ రజత పతకం సాధించాడు. గోవాలోని రవీంద్రభవన్‌లో పవర్ లిఫ్టింగ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 18 వరకు 33వ జాతీయస్థాయి సీనియర్, జూనియర్స్, మాస్టర్స్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్–2024 పోటీలు నిర్వహించారు. బెంచ్‌ప్రెస్ పోటీల్లో 157.5 కేజీల బరువును ఎత్తి యజ్ఞప్రసాద్ రజత పతకాన్ని సాధించాడు. ఈసందర్భంగా బాపట్ల జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడివలస దేవరాజ్ అభినందనలు తెలిపారు. యజ్ఞప్రసాద్ జాతీయస్థాయిలో రజత పతకాన్ని సాధించి చీరాల ఖ్యాతిని ఇనుమడింప చేయడం హర్షనీయమన్నారు. జిల్లా అసోసియేషన్ వైస్ చైర్మన్ కుమారి నంద, అధ్యక్షుడు చిన్న అంబేశ్వరరెడ్డి, నాగేశ్వరరావులు అభినందనలు తెలిపారు.

గర్భిణుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: గర్భిణుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా పని చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. గర్భిణుల వివరాలు వీలైనంత త్వరగా నమోదు చేయాలని, హైరిస్క్ వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని సూపర్‌వైజర్లకు శుక్రవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రతి నెలా 9న ఆరోగ్య కేంద్రాలలో జరిగే పీఎంఎస్ఎంఎ కార్యక్రమానికి గర్భిణులను వెంట తీసుకొచ్చి వైద్యులతో పరీక్షలు చేయించాలని ఆదేశించారు. హైరిస్క్ గర్భిణులకు ట్యాగ్ చేయాలన్నారు. ప్రసవానికి ముందుగానే బర్త్ ప్లాన్ చేసుకోవడం, రవాణా వసతులను చూసుకోవాలని సూచించారు. రక్తహీనతతో బాధపడే గర్భిణులు ప్రసవ సమయంలో, అవసరాన్ని బట్టి రక్తదానం చేసే బంధువులను సిద్ధపరచుకోవాలని ఆమె సూచించారు. ప్రతి ఒక్క గర్భిణి కనీసం ఒక్కసారైనా ఈ–సంజీవని యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని, వైద్యులు ఇచ్చిన ఆరోగ్య సలహాలు పాటించాలని తెలిపారు. టిఫా స్కాన్‌ను తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని, అభ ఐడీలో నమోదు కావాలని సూచించారు. వర్షాకాలం కనుక దోమల నివారణ చర్యల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, డాక్టర్ సీహెచ్.రత్న మన్మోహన్, డాక్టర్ అన్నపూర్ణ, ఎస్ఓ పద్మజ పాల్గొన్నారు.

నేడు శివాలయంలో హుండీ కానుకల లెక్కింపు

పెదకాకాని: భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో హుండీల కానుకలు లెక్కింపును శనివారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు డీసీ గోగినేని లీలాకుమార్ తెలియజేశారు. లెక్కింపునకు ఆలయ కల్యాణ మండపంలో సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేశామని, సేవాసమితి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొంటారని పేర్కొన్నారు. దేవదాయ శాఖ నిబంధనల మేరకు భక్తులు కూడా పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

యార్డులో 50,503 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 43,523 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 50,503 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.8,200 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.8,000 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 8,500 నుంచి రూ. 17,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 18,200 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది.

వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు

బాపట్లటౌన్: అధికారపార్టీ నేతల ఒత్తిళ్ళతో పోలీసులు వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు. తాజాగా వైఎస్సార్ సీపీ మండలపార్టీ అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డితోపాటు ఆయన అనుచరులు ఏడుగురుపై కేసులు నమోదుచేశారు. వివరాల్లోకి వెళితే పట్టణంలోని దరివాద కొత్తపాలెంలో బుధవారం రాత్రి దుర్గాదేవి నగరోత్సవం జరిగింది. ఉత్సవాన్ని నిర్వహించిన పచ్చపార్టీ నేతలు ఊరేగింపు రాఘవరెడ్డి ఇంటి ముందుకు రాగానే ''రక్త చరిత్ర సినిమాలోని అక్కడ ఇక్కడ ఎక్కడికక్కడ ఎత్తిన తలకు రాత పెడతా... దెబ్బకు నీ యబ్బను గుర్తుకు తెస్తా... అంటూ'' రెచ్చగొట్టే పాటలతో హల్‌చల్ చేశారు.. ఊరేగింపు జరిగే సమయంలో పోలీసులు అక్కడే ఉన్నారు. సీఐ దగ్గరుండి డీజే వాహనాన్ని ముందుకు తీసుకెళ్ళారు. శ్రావణమాసంలో గ్రామదేవత అమ్మవారి సారె మహోత్సవం రోజునా ఇదే రీతిలో పెట్టారు. ఇటీవల జరిగిన వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా కూడా రాఘవరెడ్డి ఇంటి ముందు డీజే బండి రాగానే అదే పాటను పెట్టి రెచ్చగొట్టారు. ఊరంతా అమ్మవారిపాటలతో జరిగిన నగరోత్సవం రాఘవరెడ్డి ఇంటి ముందుకు రాగానే రెచ్చగొట్టే విధంగా ఈ పాటలు పెట్టడం, పోలీసులంతా ఇక్కడే ఉండి కూడా ఏమి తెలియనట్లు చూడటం ఏమిటంటూ ఆగ్రహించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త డీజే నిర్వాహకులతో చెప్పి పాటను నిలుపుదల చేశారు. దీంతో ఆగ్రహించిన పచ్చపార్టీ నేతలు ఊరేగింపును రాఘవరెడ్డి అడ్డుకున్నారంటూ పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశారు.

రెచ్చగొడుతున్నారంటూ ఫిర్యాదు

వైఎస్సార్‌సీపీ మండలపార్టీ అధ్యక్షులు రాఘవరెడ్డి ఇంటి ముందుకు రాగానే రెచ్చగొట్టే పాటలతో పదేపదే రెచ్చగొడుతున్నారని, టీడీపీ నాయకుల వల్ల మాకు ప్రాణహాని ఉందని, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ దరివాద కొత్తపాలెం గ్రామానికి చెందిన పిట్టు వేణుగోపాలరెడ్డి పట్టణ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేశారు. వాస్తవాన్ని అక్కడే ఉండి గమనించిన పోలీసులు వైఎస్సార్‌సీపీ నాయకుల ఫిర్యాదును పక్కనపెట్టి టీడీపీ నాయకుల ఫిర్యాదు మేరకు రాఘవ రెడ్డి, అయన అనుచరులపై తప్పుడు కేసులు నమోదుచేశారంటూ స్థానికుల పోలీసు తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

జిల్లా వ్యవసాయ అధికారి రామకృష్ణ



సిబ్బందితో మాట్లాడుతున్న రామకృష్ణ

మార్టూరు: కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను సిబ్బంది అందిపుచ్చుకొని రైతులకు సేవచేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై. రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మార్టూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో అద్దంకి సబ్ డివిజన్ల పరిధిలోని 10 మండలాలకు చెందిన రైతుసేవా కేంద్రాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల బీమా ప్రయోజనాలు రైతులకు అందాలంటే సిబ్బంది పంట కోత ప్రయోగాలు సరైన సమయానికి కేటాయించిన భూముల్లో నిర్వహించాలన్నారు. పంటకోత నివేదికలను సకాలంలో అధికారులకు పంపించాలని ఆదేశించారు. రైతుసేవా కేంద్రాల్లో ఉన్న సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతులతో మమేకమై సలహాలు, సూచనలు అందించాలన్నారు. బాపట్ల వ్యవసాయ సహాయ సంచాలకులు రత్నకుమారి మాట్లాడుతూ రబీలో అమలు జరిగే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వర్తించే పంటలు, వాటి ప్రీమియం వివరాలను రైతులకు తెలియజేయాలన్నారు. ఏరువాక కేంద్రం బాపట్ల కోఆర్డినేటర్ డాక్టర్ బాల మురళీధర్ నాయక్ మొక్కజొన్నలో యాజమాన్య పద్ధతులు పంటను ఆశించే పురుగులు నివారణ చర్యలు గురించి తెలిపారు. మరో శాస్త్రవేత్త ఎన్ కామాక్షి శనగ, వరి పంటల్లో అధిక దిగుబడులను ఇచ్చే నూతన వంగడాల గురించి సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో ఏడీఏలు శ్రీనివాసరావు, ఎన్ మోహన్రావు, ధనరాజ్, ఏవోలు కిరణ్‌కుమార్, కే వెంకటకృష్ణ, ఎస్వీడీ కుమారి, డి సుబ్బారెడ్డి, వేణుగోపాల్, శ్రీనివాసరావు, ఎన్ మీ రమ్య, సుధీర్, ఆదినారాయణ చౌదరి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అట్ల తదియ

- సిద్ధమవుతున్న పల్లెసీమలు
- ఊయల కట్టి.. వాయినాలిచ్చి...



ముత్తయిదువుకు వాయినాలు అందిస్తున్న మహిళ (ఫైల్)

భట్టిప్రోలు: ఇస్తినమ్మా వాయినం – పుచ్చుకుంటున్నమ్మా వాయినం అంటూ మహిళలు వేడుకగా జరుపుకునే పండుగ అట్లతద్దె. ఆశ్వయుజ బహుళ తదియ నాడు ఈ పండుగ సందర్భంగా గౌరీ పూజను, వ్రతాలు చేస్తారు. తదియ తిధినే తద్దిగా పిలుస్తారు. అట్లతద్దెను పల్లెల్లో ఊయల పండుగని, గోరింటాకు పండుగని అంటారు. ముఖ్యంగా కన్యలు, ముత్తయిదువులు వేడుకగా జరుపుకుంటారు. కొత్తగా పెళ్లయిన ఆడ పిల్లల ఇళ్లల్లో మరింత వేడుకగా జరుపుకుంటుంటారు. వేడుక ముందు రోజు మహిళల చేతులకు గోరింటాకు అందంగా అలంకరించుకుంటారు. పండుగ రోజు 5, 9, 11 అట్లతో కూడిన వాయినాలు ఇవ్వడం ఆనవాయితీగా వస్తుంది. ఇలా చేయడం వల్ల గౌరీదేవి అనుగ్రహం లభిస్తుంది. అట్లతద్ది నాడు తెల్లవారు జామున లేచి అన్నం, గోంగూర పచ్చడి, పెరుగుతో కడుపు నిండా తింటారు. ''అట్ల తద్దోయ్,... ఆరట్లోయ్... ముద్ద పప్పు.. మూడట్లోయ్'' అంటూ ఇరుగు పొరుగు, స్నేహితులతో కలసి ఆటలు ఆడతారు. ఇందులో పెద్దలు కూడా ఉత్సాహంగా పాల్గొంటారు. వారి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటారు. ధైర్యంగా వీధుల్లోకి వచ్చి ఆడుకోవడానికి ఇది అదను కాబట్టి పిల్లలతో పాటు తల్లులు కూడా బాల్య జీవితాల్లోకి వెళ్లి ఆనందం పొందుతారు. గోరింటాకు ఎంత బాగా పండితే అంత మంచి మొగుడు వస్తాడని, పెళ్ళి ఈడుకు వచ్చిన యువతులను అమ్మమ్మ, నాయనమ్మలు ఆటపట్టిస్తుంటారు. ఒకప్పుడు ప్రకృతి సిద్ధంగా లభించే గోరింటాకు ప్రస్తుతం లభించకపోవడంతో నేటి యువతులు మార్కెట్లో దొరికే కోన్‌లతో చేతులను అలంకరించుకుంటున్నారు.

తదియ రోజు గౌరీపూజ ముగిశాక ఊయల వేడిక ఘనంగా నిర్వహిస్తారు. ఉపవాసం ఉన్న మహిళలందరూ తప్పనిసరిగా ఊయల ఊగుతారు. ఇందు కోసం పల్లెల్లో పెద్ద చెట్లకు ఉయ్యాలలు వేస్తారు. పొద్దు పోయే వరకు మహిళలు పోటీలు పడి ఉత్సాహంగా ఊయల ఊగుతుంటారు.

అమరావతి రైతుల కౌలు సమస్యలు పరిష్కరిస్తాం

సీఆర్డీఏ అదనపు కమిషనర్ ప్రవీణ్‌చంద్



రైతుల నుంచి సమస్యలు స్వీకరిస్తున్న ప్రవీణ్‌చంద్

తాడికొండ: రాజధాని అమరావతి ప్రాంతంలో రైతుల కౌలు సమస్యలను ఇప్పటికే కొన్ని పరిష్కరించి వారి ఖాతాల్లో నగదు జమచేశామని, మిగిలిన వారి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ఏపీ సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి. సూర్యసాయి ప్రవీణ్‌చంద్ తెలిపారు. తుళ్ళూరు సీఆర్డీయే ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం జరిగిన గ్రీవెన్స్‌డేలో రాజధాని రైతులు వారి సమస్యలను అదనపు కమిషనర్‌కు విన్నవించుకున్నారు. ఆయన అధిక శాతం అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. మిగిలినవి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సీఐడీ పరిధిలో ఉన్న కొందరి సమస్యలకు కూడా వెంటనే పరిష్కారం చూపుతామని ఆయన హామీ ఇచ్చారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్న గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

కార్యక్రమంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం. విశ్వేశ్వరనాయుడు, కె. స్వర్ణమేరి, బి. సాయి శ్రీనివాస్ నాయక్, జి. భీమారావు, డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరు పంచాయతీ కార్మికుల మృతి

- గుర్తు తెలియని వాహనం ఢీ
- తాడికొండ మండలం నిడుముక్కలలో ఘటన



ఘటనా స్థలంలో మృతదేహాలు

తాడికొండ: గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు పంచాయతీ కార్మికులు మృతి చెందిన ఘటన తాడికొండ మండలం నిడుముక్కల గ్రామ పరిధిలో శుక్రవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుళ్ళూరులో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న బత్తుల అయ్యప్ప(43), కంతేటి ఏసు(53) ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. నిడుముక్కల శివారు ప్రింటింగ్ ప్రెస్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు ఘటనా స్థలంలోనే ప్రాణాలొదిలారు. రోడ్డుపై మృతదేహాలు పడిఉన్న తీరుచూసి స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. గుర్తు తెలియని లారీ ఢీకొని ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. ఘటనా స్థలానికి తాడికొండ సీఐ కె. వాసు చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. బాధితుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు సీఐ తెలిపారు.

రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం సంతాపం

ప్రమాదంలో మృతి చెందిన తుళ్ళూరు పంచాయతీ కార్మికులు అయ్యప్ప, ఏసులకు రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం తీవ్ర సంతాపం తెలియజేసింది. కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు ఎం. రవి, చెరుకూరి సుశీల తదితరులు మాట్లాడుతూ మృతులు ఇద్దరూ పేద కుటుంబాలకు చెందిన వారని, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.